సాక్షి
ప్రకాశం
బుధవారం | 7 | జూన్ | 2023



జిల్లాలో ప్రమాదాలు తగ్గుముఖం
జిల్లాలో ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయని ఎస్పీ మలికగార్గ్ అన్నారు. పెద్దదోర్నాల పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. - 8లో..



విద్యుత్ కార్యాలయంలో భారీ అగ్నిప్రమాదం
ఒంగోలు నగరం కర్నూలు రోడ్డులో ఉన్న విద్యుత్ కార్యాలయంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
42 /31
వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉక్కపోత అధికం. వడగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

క్లబ్‌ఫుట్‌కు జీజీహెచ్‌లో మెరుగైన వైద్యం

- జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్



ప్రపంచ క్లబ్‌ఫుట్ డేను నిర్వహిస్తున్న జీజీహెచ్ వైద్యులు

ఒంగోలు అర్బన్: క్లబ్‌ఫుట్ (తాలిప్స్ ఈక్వినోవైరస్ (టీఈవీ)) బారిన పడిన వారికి జీజీహెచ్‌లో మెరుగైన వైద్యం అందించి వారికి పూర్తి స్థాయిలో నయం చేస్తున్నామని, అందుకు కృషి చేస్తున్న ఆర్థోపెడిక్ విభాగం వైద్యులను అభినందిస్తున్నామని జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్ అన్నారు. మంగళవారం జీజీహెచ్‌లో ప్రపంచ క్లబ్‌ఫుట్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ క్లబ్‌ఫుట్ ఫ్రీ ఇండియాలో భాగంగా క్యూర్ ఎన్‌జీఓ సహకారంతో వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యాధి గుర్తించిన శిశువులకు ఐదు సంవత్సరాల పాటు వైద్య సేవలు అందించాల్సి ఉంటుందన్నారు. జీజీహెచ్‌లో ఎంతోమందికి ఈ చికిత్స చేసి వ్యాధిని నయం చేశామన్నారు. దీనిలో ఆర్థోపెడిక్ హెచ్‌ఓడీ నారాయణరావు, ఆర్ఎంఓ చైతన్యవర్మ, ఇతర డాక్టర్‌లు జయశ్రీ, భరణిదేవి, అజయ్, సంధ్య, కిరణ్, మౌనిక, కళ తదితరులు పాల్గొన్నారు.

క్లబ్‌ఫుట్ అంటే ఇదీ...
శిశువు పాదాలను ప్రభావితం చేసి పుట్టకతో వచ్చే అరుదైన లోపం. పాదాలు లోపలికి మెలితిప్పినట్లు వస్తాయి. ఈ వ్యాధి ఒకటి లేదా రెండు కాళ్లకు కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది. పిల్లలు సాధారణంగా నడవడం కష్టసాధ్యమవుతుంది. క్లబ్‌ఫుట్‌లో ఎముక కండరాలను అనుసంధానించే కణజాలం సాధారణం కంటే తక్కువగా ఉండటం వల్ల క్లబ్‌ఫుట్ బారిన పడతారు.

రెండు రైళ్లు రద్దు

మార్కాపురం: ఒడిశాలో జరిగిన రైలు ప్రమాద సంఘటన నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు మార్కాపురం మీదుగా నడిచే రెండు రైళ్లను రద్దు చేసినట్లు స్టేషన్ మాస్టర్ జనార్దన్ మంగళవారం రాత్రి తెలిపారు. ఈనెల 7వ తేదీన ప్రయాణించాల్సిన హౌరా–సత్యసాయి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, ఈనెల 9వ తేదీన శాలిమార్–వాస్కోడిగామా రైళ్లను రద్దు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

డబుల్ బొనాంజా..!

సర్కార్ వైద్యశాలల్లో సూపర్ స్పెషాలిటీ సేవలందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జీజీహెచ్‌లకు అనుబంధంగా ఉన్న మెడికల్ కళాశాలల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించింది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులు సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో పీజీలు చేసేందుకు పొరుగు రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పీజీ సీట్ల సంఖ్యను పెంచుతూ వస్తోంది. ఒంగోలు మెడికల్ కళాశాలలో ఈ ఏడాది ఇప్పటికే రెండు దఫాలుగా 65 పీజీ సీట్లు పెంచింది. తద్వారా వైద్యుల కొరత తీరడమే కాకుండా సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులు అందుబాటులోకి రానున్నారు.



- ఒంగోలు మెడికల్ కాలేజీలో పెరిగిన పీజీ సీట్లు
- కీలక విభాగాలకు నూతనంగా 31 కేటాయింపు
- ఈ ఏడాది మార్చిలోనే 34 పీజీ సీట్లు ఇచ్చిన వైనం
- ఒక్క ఏడాదిలోనే 65 పీజీ సీట్ల కేటాయింపు
- 120 ఎంబీబీఎస్ సీట్లతో బ్యాచ్ కొనసాగింపు
- అనేక క్లిష్టమైన రోగాలకు కూడా వైద్య సేవలు అందించే అవకాశం
- జీజీహెచ్, వైద్య కళాశాలపై ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని ప్రత్యేక శ్రద్ధ

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

స్పెషలిస్టు వైద్యుల సంఖ్యను పెంచడమే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సైతం సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ పరిధిలోని వైద్య కాలేజీల్లో భారీగా పీజీ వైద్య సీట్లు పెంచేలా దృష్టిసారించింది. ప్రస్తుతం ఉన్న సీట్లకు దాదాపు రెట్టింపు పీజీ సీట్లు అందుబాటులోకి వచ్చేలా చూస్తోంది. అందులో భాగంగా ఒంగోలు మెడికల్ కళాశాలలో మూడు నెలల వ్యవధిలో 65 పీజీ సీట్లు పెంచింది. ఫలితంగా రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తోంది. దీంతో జిల్లా ప్రజలు క్లిష్టమైన రోగాలకు ఇతర జిల్లాలకు, నగరాలకు, మెట్రో పాలిటన్ సిటీలకు వెళ్లకుండానే ఇక్కడే వైద్యం పొందే అవకాశం ఏర్పడుతోంది. ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి ప్రత్యేక చొరవతోనే పీజీ సీట్లు పెరిగేందుకు దోహదపడింది.

మహానేత, డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 2004లో తొలిసారి ముఖ్యమంత్రి అయిన తరువాత జిల్లాకు రిమ్స్ వైద్యశాలను మంజూరు చేశారు. జిల్లా ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో పెట్టుకొని దానిని ఒంగోలులో ఏర్పాటు చేశారు. అప్పటి, ఇప్పటి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ప్రత్యేక చొరవతో ఒంగోలుకు రిమ్స్ వైద్యశాల వచ్చింది. ఆ తరువాత రిమ్స్ అనుసంధానంగా వైద్య కళాశాలను కూడా డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రతిపాదనలు కేంద్రానికి పంపి మంజూరు చేసేందుకు కృషి చేశారు. ఇది జిల్లా వాసులకు వరంగా మారింది.

కొత్తగా 31 పీజీ సీట్లు కేటాయింపు
ఒంగోలు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు నూతనంగా 31 పీజీ సీట్లు కేటాయించారు. గతంలో ఈ కళాశాలకు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం వచ్చి మౌలిక వసతులను పరిశీలించింది. వైద్య కళాశాలలో పీజీ సీట్లు పెంచటంతో పాటు జీజీహెచ్‌లో మెరుగైన వైద్య సేవలు కూడా అందించేలా ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ప్రత్యేక దృష్టిసారించారు. ముఖ్యమంత్రి దృష్టికి పీజీ సీట్ల పెంపు విషయాన్ని తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన సీఎం వైఎస్ జగన్ పీజీ సీట్లు పెంచేందుకు కావాల్సిన అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేయటానికి, కొత్తగా నిర్మాణాలు చేపట్టటానికి నిధులు మంజూరు చేశారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం సైతం ఇక్కడున్న వసతులపై సంతృప్తి వ్యక్తం చేసింది. ఫలితంగా పీజీ సీట్ల పెంపునకు మార్గం సుగమం అయింది.

84కు చేరిన పీజీ సీట్ల సంఖ్య
నూతనంగా మంజూరు చేసిన పీజీ సీట్లతో వైద్య కళాశాలలో మొత్తం సీట్ల సంఖ్య 84కు చేరింది. గతంలో 19 పీజీ సీట్లు ఉండేవి. వాటిలో ఫిజియాలజీ 4, ఫార్మకాలజీ 4, మైక్రోబయాలజీ 4, బయోకెమిస్ట్రీ 2, సైక్యాట్రి 2, ఫొరెన్సిక్ మెడిసిన్ 2, పల్మనరీ మెడిసిన్ 1 మాత్రమే అందుబాటులో ఉండేవి.

పీజీ సీట్ల పెంపుపై హర్షం
ఒంగోలు అర్బన్: ప్రభుత్వ మెడికల్ కాలేజీలో గతంలో 19 పీజీ సీట్లు మాత్రమే ఉండేవి, రెండు దఫాలుగా పెరిగిన సీట్లతో కలిపి మొత్తం 84 సీట్లకు చేరడంపై కాలేజీ ప్రిన్సిపల్ సాల్మాన్‌రాజు, జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, వైస్ ప్రిన్సిపల్ సుధాకర్, ఆర్ఎంఓ చైతన్యవర్మ మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సీట్ల పెంపు కోసం అంకితభావంతో పనిచేసిన హెచ్ఓడీలు, డాక్టర్‌లు ఇతర సిబ్బంది అభినందనీయులని అన్నారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, జిల్లా మంత్రి ఆదిమూలపు సురేష్‌ల ప్రత్యేక కృషికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ ఏడాది మార్చిలో అదనంగా 34 పీజీ సీట్లు కేటాయించారు. అప్పట్లో మంజూరైన వాటిలో జనరల్ సర్జరీ 11, కమ్యూనిటీ మెడిసిన్ 7, అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ 9, అనస్తీషియా 7 సీట్లు కేటాయించారు. వాటితో పాటు ప్రస్తుతం నూతనంగా మరో 31 సీట్లు కేటాయిస్తూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా కేటాయించిన వాటిలో పాథాలజీ విభాగంలో 9, పీడియాట్రిక్స్‌లో 7, రేడియాలజీలో 5, ఈఎన్‌టీలో 5, ఆప్తమాలజీలో మరో 5 పీజీ సీట్లు కేటాయించారు. ఇకపోతే ఎంబీబీఎస్ 120 సీట్లతో బ్యాచ్ కొనసాగుతోంది.

మెరుగైన వైద్య సేవలు అందించటమే లక్ష్యం



ఒంగోలు నగరంతో పాటు జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధిలో భాగంగా వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించిన విషయం తెలిసిందే. అందుకోసం ఎటువంటి క్లిష్టమైన రోగానికైనా ఒంగోలులోని ప్రభుత్వ వైద్యశాలలోనే వైద్యం అందేలా వైద్య సేవలు మెరుగు పరుస్తున్నాం. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఒంగోలులో రిమ్స్ వైద్యశాలను మంజూరు చేశారు. ఆ తరువాత వైద్య కళాశాల కూడా మంజూరైంది. అయితే టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క పీజీ సీటును కూడా తీసుకురాలేక పోయారు. అదనంగా 31 సీట్లు కేటాయించటం ద్వారా మొత్తం 84కి చేరుకున్నాయి. జీజీహెచ్‌లో పీజీ సీట్లు కేటాయించేలా సీఎం వైఎస్ జగన్ చేసిన కృషి మరువలేనిది. జీజీహెచ్‌ని ఇంకా అభివృద్ధి చేస్తాం.
– బాలినేని శ్రీనివాస రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే

పేదలకు మెరుగైన వైద్యసేవలు



ప్రభుత్వ మెడికల్ కాలేజీలో పెరిగిన పీజీ సీట్లతో పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించవచ్చు. కొత్త సీట్ల కోసం కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా మంత్రికి కృతజ్ఞతలు. పీజీ సీట్ల పెంపుతో ప్రత్యేక విభాగాల వైద్యులు అందుబాటులోకి వస్తారు. దీనితో మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందిచేందుకు వీలవుతుంది.
– సాల్మన్‌రాజు, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కానివ్వద్దు

- కలెక్టర్ దినేష్‌కుమార్



భూసేకరణ అంశాలపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ కె.శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్పందన భవనంలో భూసేకరణ, రెవెన్యూ అంశాలపై సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయిలో తీసుకున్న చర్యలపై నివేదిక అందచేయాలన్నారు. జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలన్నారు. ప్రతిరోజు జేకేసీ సైట్ ద్వారా వచ్చిన అర్జీలను స్వీకరించాలన్నారు. ప్రజలు సంతృప్తి చెందేలా అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించాలన్నారు. ప్రతి రోజు కనీసం 30 ఎకరాలు రీ సర్వే చేయాలని సూచించారు. చుక్కల భూములకు సంబంధించి రైతులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం ఇచ్చిన పత్రాల పంపిణీ రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. సాదా బైనామా కేసుల పరిష్కారంలో పురోగతి కనిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూ సేకరణ ప్రక్రియలో పెండింగ్ క్లెయిమ్‌లు వేగంగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేత మాధవన్, ట్రైనీ ఐఏఎస్ శౌర్యపటేల్, డీఆర్ఓ శ్రీలత, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు విశ్వేశ్వరరావు, అజయ్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు లోకేశ్వరరావు, చెన్నయ్య, గ్లోరియా ఇతర అధికారులు పాల్గొన్నారు.

బంధువుల గొడవకు రాజకీయ రంగా..?

- రాజకీయ లబ్ధి పొందేందుకే ఎమ్మెల్యే స్వామి డ్రామాలు
- గ్రామంలో నిజ నిర్ధారణ కమిటీకి మేం సిద్ధం
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు



టంగుటూరులో మాట్లాడుతున్న వరికూటి ఆశోక్‌బాబు

టంగుటూరు: ' బంధువుల గొడవకు రాజకీయ రంగు పులిమి లబ్ధి పొంది లబ్ధి పొందాలనుకోవడం దుర్మార్గం. రావివారిపాలెంలో బంధువుల మధ్య ఎప్పటి నుంచో గొడవలు ఉన్నాయి. పాత కక్షల నేపథ్యంలో వారి బంధువే మహిళను ట్రాక్టర్‌ను ఢీకొట్టి చంపాడు. అయితే మరుగుదొడ్ల స్కాంను తప్పిదారి పట్టించేందుకే ఎమ్మెల్యే స్వామి కొత్త డ్రామాకు తెరలేపాడని' వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళను చంపిన వ్యక్తికి వారికి ఆస్తి తగాదాలు ఉన్నాయి, అంతకు మించి వేరే కారణాలు ఉన్న తగాదాలు ఉన్నాయి తప్ప ఎక్కడా పార్టీ ప్రస్తావన లేదన్నారు. 2021లో ఇరువర్గాలు టంగుటూరు పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టుకున్నారన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ఎమ్మెల్యే స్వామికి ధైర్యం ఉంటే గ్రామంలో నిజ నిర్ధారణ కమిటీ వేయాలని, అప్పుడే అసలు నిజాలు తెలుస్తాయన్నారు. కేవలం రాజకీయంగా లబ్ధి కోసమే ఇలాంటి నీచ రాజకీయానికి ఎమ్మెల్యే పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు.

కాజేసిన నిధులు తిరిగి ఇవ్వాలి..
మరుగుదొడ్ల నిర్మాణం పేరుతో ఎమ్మెల్యే స్వామి కోట్లాది రూపాయలు స్వాహా చేశాడని, ఆ డబ్బులు తిరిగి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే స్వామి ఇంటికి చెంబులతో నిరసన కార్యక్రమం విజయవంతమైందన్నారు. మరుగుదొడ్ల పేరుతో సుమారు రూ.22 కోట్లను స్వాహా చేసిన వైనంపై ఆధారాలతో సహా బట్టబయలు చేశామన్నారు.ఎనిమిది నెలలుగా ఈ అంశంపై తాను పోరాటం చేస్తున్నానని, బహిరంగ చర్చకు పిలిచినా రాలేదన్నారు. శాంతియుతంగా చేపట్టిన కార్యక్రమాన్ని అనవసర రాద్ధాంతం చేశాడని ధ్వజమెత్తారు. మరుగుదొడ్ల స్కాం నుంచి తప్పించుకునేందుకే సోమవారం పోటీ ర్యాలీ పెట్టాడని, ఎమ్మెల్యే తన చొక్కా చించుకొని కొత్త డ్రామాకు తెరతీశాడని ఆరోపించారు. కొండపి మండలం అనకర్లపూడిలోనే 65 మరుగుదొడ్లు కనిపించడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నివేదిక ఇచ్చారని, ఒక్క గ్రామంలోనే రూ.19.30 లక్షలు కాజేశారన్నారని ఆరోపించారు. పేదల సొమ్మును తిరిగి ఇచ్చే వరకు ఆందోళన చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

మరుగుదొడ్ల కుంభకోణంపై విచారణ జరపాలి

- అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలి
- మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: మరుగుదొడ్ల నిర్మాణంలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ డిమాండ్ చేశారు. కొండపి నియోజకవర్గంలో జరిగిన అక్రమాలపై విచారణ చేయటంతో పాటు అక్రమాలకు పాల్పడిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఒక ప్రకటనలో ఆయన కోరారు. దాదాపు రూ.22 కోట్ల కుంభకోణం జరిగిందని, జన్మభూమి కమిటీల పేరుతో పేదలకు నిర్మించే మరుగుదొడ్లలో కూడా అక్రమాలకు పాల్పడిన వైనాన్ని కొండపి వైఎస్సార్ సీపీ ఇన్చార్జి అశోక్ బాబు బయట పెట్టారన్నారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకుంటూ స్థానిక ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు దీనిని రాజకీయం చేయాలని చూడటం దుర్మార్గమన్నారు. జన్మభూమి కమిటీలు దోపిడీ చేయకపోతే విచారణకు సిద్ధపడి వాస్తవాలను బయటపెట్టాలని ఆయన సవాల్ విసిరారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో బాల్య వివాహాలను పక్కాగా అరికట్టాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. మండల స్థాయి అధికారులతో మంగళవారం వివిధ అంశాలపై వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టేందుకు అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సచివాలయాల్లో ప్రతి వివాహాన్ని ఆధార్ ప్రకారం మహిళా పోలీసులు నమోదు చేయాలన్నారు. తక్కువ వయసు ఉన్న వారిని గుర్తిస్తే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. సచివాలయాల్లో అందిస్తున్న సేవలను మరింత పెంచాలని సూచించారు. ఆ మేరకు ఎంపీడీవోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సర్వీసులకు సంబంధించి నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాలన్నారు. అంతే కాకుండా సచివాలయ సిబ్బంది ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. దీనిలో జేసీ శ్రీనివాసులు, ట్రైనీ ఐఏఎస్ శౌర్యపటేల్, సీపీఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ పేరయ్య, ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి పాల్గొన్నారు.

పొగాకు అత్యధిక ధర రూ.215



వేలం నిర్వహిస్తున్న అధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో పొగాకు అత్యధిక ధర రూ. 215 పలికింది. సరాసరి ధర రూ.205 పలికింది. వేలం కేంద్రానికి మల్లవరప్పాడు, శివపురం, గొర్లమిట్ట, మట్టిపాడు గ్రామాలకి చెందిన రైతులు వేలానికి 900 బేళ్లను తీసుకురాగా వాటిలో 844 బేళ్లను కొనుగోలు చేసి 56 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ. 215 కాగా, కనిష్ఠ ధర రూ. 160 పలకగా, సరాసరి రూ. 205.86 ధర పలికింది. వేలంలో మొత్తం 28 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పొగాకు అత్యధిక ధర రూ.213
కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం కేజీ పొగాకు ధర ఏకంగా రూ.213 పలికింది. కొండపి పొగాకు వేలంకేంద్రం పరిధిలోని ముగచింతల, గుర్రప్పడియ, నెన్నూరుపాడు, చతుకుపాడు, కె.అగ్రహారం గ్రామాలకు చెందిన పొగాకు రైతులు మంగళవారం వేలం కేంద్రానికి 860 పొగాకు బేళ్లు తీసుకువచ్చారు. వాటిలో వ్యాపారులు 763 బేళ్లు కొనుగోలు చేయగా వివిధ కారణాలతో 68 బేళ్లు తిరస్కరించారు. సరాసరి ధర రూ.205.88 రైతులకు దక్కింది.

క్లుప్తంగా

కానిస్టేబుల్ సస్పెన్షన్

ఒంగోలు టౌన్: నర్సింగ్ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన తాలుకా హెడ్ కానిస్టేబుల్‌ను ఎస్పీ మలికా గర్గ్ సస్పెండ్ చేశారు. ఆదివారం రాత్రి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఎంఎల్సీ కేసులో వాంగ్మూలం నమోదు చేసేందుకు వెళ్లిన హెడ్ కానిస్టేబుల్ కోటిరెడ్డి లిఫ్ట్‌లో ఎక్కిన నర్సింగ్ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు కేసు నమోదైంది. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ..సదరు కానిస్టేబుల్‌పై శాఖాపర చర్యలకు ఉపక్రమించారు. బాధిత విద్యార్థిని నుంచి ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేయడమే కాకుండా సస్పెండ్ చేయడం గమనార్హం.

రోడ్డు ప్రమాదంలో క్లీనర్ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

త్రిపురాంతకం: నేషనల్ హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. త్రిపురాంతకం మండలం దూపాడు సమీపంలో మంగళవారం ఆగి ఉన్న లారీని సంఘం డైరీ పాల వ్యాన్ ఢీకొట్టడంతో లారీ క్లీనర్ గల్లా ఆంజనేయులు(23) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునిది పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం మాదాల గ్రామం. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి అన్న శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీవీ సైదులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైలు కింద పడి మృతి చెందిన మృతదేహం

ఒంగోలు టౌన్: నగరంలోని పోతురాజు కాలువ పక్కన ఉన్న ఎగువ రైల్వే ట్రాక్‌పై సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. మృతునికి 50 ఏళ్ల వయసుంటుందని, బిస్కెట్ రంగు ప్యాంట్, మెరూన్, పసుపు రంగు కలిసిన గళ్ల చొక్కా ధరించి ఉన్నాడు. మృతుని జేబులో నెల్లూరు నుంచి విజయవాడ, విజయవాడ నుంచి ఒంగోలు, ఒంగోలు నుంచి సికింద్రాబాద్, సికింద్రాబాద్ నుంచి ఒంగోలుకు ప్రయాణించినట్లు టికెట్లు ఉన్నాయి. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. రైల్వే సీఐ శ్రీకాంత్ మృతుని సీసీ పుటేజీని విడుదల చేశారు. ఒంగోలు జీఆర్పీ ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వివరాలకు 94905 66577 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బస్సులో బంగారు ఆభరణాలు చోరీ

మార్కాపురం: మార్కాపురం నుంచి దోర్నాల వెళ్తున్న మహిళ బ్యాగ్‌లో 20 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ ఘటనపై మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శశికుమార్ చెప్పారు. వివరాల్లోకి వెళితే.. దోర్నాలకు చెందిన సబ్బసాని సతీష్‌కుమార్‌రెడ్డి భార్య రమాదేవి గిద్దలూరు మండలంలోని దద్దవాడ గ్రామం నుంచి సోమవారం సాయంత్రం దోర్నాల వెళ్లేందుకు బస్సులో మార్కాపురం వచ్చింది. అనంతరం దోర్నాల బస్సులో ఇంటికి వెళ్లి బ్యాగ్ చూసుకోగా అందులోని 20 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా..పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సత్తా చాటిన కురిచేడు ఎడ్లు



బండను లాగుతున్న ఎడ్లు

బేస్తవారిపేట: మండలంలోని అక్కపల్లెలో లక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా మంగళవారం రాష్ట్ర స్థాయిలో న్యూ కేటగిరి విభాగంలో బండ లాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో కురిచేడు మండలం కాటంవారిపల్లెకు చెందిన కాటం పెద్దిరెడ్డి ఎడ్లు 4374 అడుగుల దూరం లాగి మొదటి స్థానం, గిద్దలూరు మండలం బురుజుపల్లెకు చెందిన యరమల సోహిత్‌రెడ్డి ఎడ్లు 3617 అడుగులతో ద్వితీయ, వైపాలెం మండలం వీరయపాలెం దూదేకుల సుభాని ఎడ్లు 3600 అడుగులతో తృతీయ, బేస్తవారిపేటకు చెందిన డి.రూభి ఎడ్లు 3000 అడుగులతో నాల్గవ, రాచర్ల మండలం జి.కొత్తపల్లెకు చెందిన వెంకటరెడ్డి ఎడ్లు 2611 అడుగులతో ఐదోవ స్థానంలో నిలిచాయి. బహుమతులుగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను అందజేశారు.

జిల్లాలో ప్రమాదాలు తగ్గుముఖం

- ఎస్పీ మలికాగర్గ్
- శాంతి భద్రతల సంరక్షణలో అనుక్షణం అప్రమత్తం
- పెద్దదోర్నాల పోలీస్‌స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

పెద్దదోర్నాల: జిల్లాలో ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. పెద్దదోర్నాల పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆమె సందర్శించారు. తొలుత స్టేషన్‌లోని రికార్డులతో పాటు స్టేషన్ ప్రాంగణంలోని పోలీస్ క్వార్టర్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతలను సంరక్షించటంలో పోలీసు యంత్రాంగం అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరిస్తుందన్నారు. నేరాలను నియంత్రించేందుకు పోలీస్ యంత్రాంగం శాయశక్తులా కృషి చేస్తుందని తెలిపారు. లేజర్ స్పీడ్ గన్‌లను వినియోగించి ప్రమాదాల నివారణతో పాటు, వాహనాల మితిమీరిన వేగాన్ని కట్టడి చేసేలా యంత్రాంగం చర్యలు చేపట్టిందన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపే వారిని పరీక్షించి భారీ జరిమానాలు విధిస్తున్నామన్నారు. నల్లమల ప్రాంతంలో అత్యంత క్లిష్టమైన శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లే రహదారిలో స్పీడ్ గన్‌లను ఏర్పాటు చేసి వేగ నియంత్రణ చేపడుతున్నామని తెలిపారు. నియంత్రించిన వేగం కంటే ఎక్కువ వేగంతో వెళితే లేజర్ గన్‌తో జరిమానాలు విధిస్తుండటంతో ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు. సెల్ ఫోన్లు మాట్లాడుతూ వాహనాలు నడపడం నేరమన్నారు. ఘాట్‌రోడ్లలో 30 కి.మీ వేగానికంటే ప్రయాణించడం అనర్థదాయకమని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మూల మలుపుల్లో వాహనాల రాకపోకలకు అడ్డుగా ఉన్న చెట్ల పొదలను తొలగించే కార్యక్రమం చేపట్టామన్నారు. ఘాట్ రోడ్లలో లోయల వైపు ఏర్పాటు చేసిన క్రాస్ బారియర్స్‌కు రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టామన్నారు. అనంతరం మహిళా పోలీసులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం స్టేషన్ ప్రాంగణంలో మొక్క నాటారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి అంకితా సురానా, డీఎస్పీలు వీరరాఘువరెడ్డి, మరియదాసు, సీఐ మారుతీకృష్ణ, పెద్దదోర్నాల, యర్రగొండపాలెం, పెద్దారవీడు, పుల్లలచెరువు ఎస్సైలు శ్రీనివాసరావు, కోటయ్య, రాజేష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారులకు ఈకేవైసీ తప్పనిసరి

- జిల్లా ఖజానా శాఖాధికారి జగన్నాథరావు



మాట్లాడుతున్న జిల్లా ఖజానా శాఖాధికారి జగన్నాథరావు

ఒంగోలు సబర్బన్: ఖజానా శాఖ ద్వారా లబ్ధి పొందే పింఛన్‌దారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా ఖజానా శాఖాధికారి ఏ.జగన్నాథరావు అన్నారు. స్థానిక దక్షిణ బైపాస్‌లోని జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలో మంగళవారం పింఛన్‌దారుల సంఘ నాయకులు, ఖజానా శాఖాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికి జిల్లాలో సరాసరిన 75 శాతం ఈకేవైసీ నమోదు పూర్తయిందని, మిగిలిన 25 శాతం కూడా ఈ నెల 10వ తేదీ లోగా ఈకేవైసీ నమోదు పూర్తి చేయాలన్నారు. పింఛనుదారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కే.ఆల్‌ఫ్రెడ్ మాట్లాడుతూ జిల్లాలో గత వారంలో ఈకేవైసీ ప్రక్రియ కొంత మందకొడిగా సాగినా రెండు రోజుల నుంచి పింఛన్‌దారులు చురుకుగా ఈకేవైసీ నమోదు వేగవంతం చేశారన్నారు. రానున్న రోజుల్లో 100 శాతం పూర్తి చేసేందుకు అందరినీ అప్రమత్తం చేశామన్నారు. సహాయ ఖజానా శాఖాధికారి కె.రాజ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని ఒంగోలు, పొదిలి, దర్శి, కనిగిరి, మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కంభం ఖజానా కార్యాలయాల అధికారులు, సిబ్బంది ఈకేవైసీ నమోదుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పింఛనుదారుల సంఘ నాయకులను సమన్వయం చేసుకొని వారికి ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలన్నారు. ఈ ప్రక్రియను సాధ్యమైంత వరకు 9వ తేదీ లోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కూడా ఆదేశించారు. 100 శాతం ఈకేవైసీ చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. సమావేశంలో ఉప ఖజానాధికారులు పీవీ నారాయణ, డి.రాజ్యలక్ష్మి, సిబ్బంది బాషా, అనూష, శ్రీధర్, నివేదిత, నరేంద్ర, పింఛనుదారుల సంఘం నేతలు జిల్లా అధ్యక్షుడు అంకిరెడ్డి, జిల్లా కార్యదర్శి తోట రాఘవరావు, కోశాధికారి వి.శంకరరెడ్డి, యూజీసీ పింఛనుదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సీఎల్‌వీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బదిలీల్లో బిజీ బిజీ..

- వెబ్ ఆప్షన్లకు ఉత్తర్వులు జారీ
- 186 మంది హెడ్మాస్టర్లు, 2719 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలీలకు దరఖాస్తులు
- ఎస్‌జీటీ బదిలీలకు 3161 మంది దరఖాస్తు

ఒంగోలు: జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియ జోరుగా సాగుతోంది. ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది. ప్రిఫరెన్షియల్ కోటా విషయంలో కొందరు తప్పుడు సర్టిఫికెట్లు ఇస్తున్నారని డీఈఓకి ఫిర్యాదులందాయి. ఇలా అయితే అర్హులకు అన్యాయం జరుగుతుందని పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు.

ప్రారంభమైన వెబ్ ఆప్షన్లు:

గత ప్రభుత్వ హయాంలో వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఉపాధ్యాయులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసేది. సర్వర్లు డౌన్ కావడం, ఓపెన్ కాక తిప్పలు పడేవారు. అయితే ప్రస్తుతం అటువంటి సాంకేతిక సమస్యలు ఏమాత్రం కనిపించడంలేదు. దీంతో అటు గ్రేడ్ 2 హెడ్మాస్టర్లు, ఇటు స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు తమకు ఆసక్తి ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసుకునే ప్రక్రియలో బిజీగా ఉన్నారు. ప్రధానంగా స్కూల్ అసిస్టెంట్లు దాదాపు 3 వేల మంది ఉండడం, వారంతా ఖాళీగా ఉన్న వేలాది పోస్టులకు ర్యాంకులను ఇచ్చుకుంటూ ఎంపిక చేసుకోవాల్సి రావడంతో ఈ ప్రక్రియ కొంత జాప్యమవుతోంది. కంప్యూటర్ పరిజ్ఞానం తక్కువ ఉన్న వారు కంప్యూటర్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు.

బదిలీలకు 6066 మంది దరఖాస్తు.

బదిలీలకు 6066 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. ఐదేళ్ల పాటు ఒకే పాఠశాలలో పనిచేసిన హెడ్మాస్టర్లు, 8 ఏళ్ల పాటు ఒకే పాఠశాలలో పని చేసిన ఉపాధ్యాయులు బదిలీలకు అర్హులు. వీరు తప్పకుండా బదిలీకి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. వారిలో 186 మంది గ్రేడ్ 2 హెడ్మాస్టర్లు ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్ నాన్ లాంగ్వేజెస్‌కు సంబంధించి బయోలాజికల్ సైన్స్ 250, గణితం 444, ఫిజికల్ సైన్స్ 318, సోషల్ స్టడీస్ 281, పీఈటీ/పీడీలు 162 మంది ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజీలకు సంబంధించి తెలుగు 613, సంస్కృతం 1, ఉర్దూ 8, హిందీ 291, ఆంగ్లం 351 మంది ఉన్నారు. వీరు కాకుండా సెకండరీ గ్రేడ్ టీచర్లు 3161 మంది బదిలీలకు వెబ్ ఆప్షన్లు నమోదులో బిజీగా ఉన్నారు.

జీఓ ప్రకారమే ఉత్తర్వులు అమలు చేయాలి..

అర్హత లేకపోయినా ప్రిఫరెన్షియల్ పాయింట్లు పొందేందుకు చాలా మంది పలు రకాల పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. అయితే వీటిపై పలువురు ఉపాధ్యాయ వర్గాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో వాటిని తాత్కాలికంగా నిలుపుదల చేశారు. అభ్యంతరాలను ఉపాధ్యాయ బదిలీల కమిటీ చైర్మన్‌గా ఉన్న జిల్లా కలెక్టర్ ముందు పెట్టాలని నిర్ణయించారు. కలెక్టర్ తీసుకునే నిర్ణయం ఆధారంగా ప్రిఫరెన్షియల్ కోటాలో పాయింట్లు ఇవ్వాలా లేదా అనేది వెల్లడి కానుంది.

మరుగుదొడ్ల స్కాంలో ఎమ్మెల్యే డోలా నెంబర్‌వన్

- ఎమ్మెల్సీ పోతుల సునీత

చీరాల : టీడీపీ హయాంలో దోచుకో..దాచుకో అన్న చందంగా కొండపి ఎమ్మెల్యే డోలా వీరాంజనేయస్వామి అనేక అక్రమాలకు పాల్పడ్డాడని, అక్రమాలను ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్న నీచ సంస్కృతులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సాగవని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు పోతుల సునీత అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొండపి ఎమ్మెల్యే స్వామి టీడీపీ హయాంలో మరుగుదొడ్లు నిర్మించకుండానే రూ.22 కోట్లు స్వాహా చేశాడని ధ్వజమెత్తారు. అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా టీడీపీ నేతలు, ఎమ్మెల్యేలు ముందు వరుసలో ఉన్నారన్నారు. అవినీతిని ప్రశ్నిస్తే కొండపిలో అలజడులు సృష్టించి దాడులకు పాల్పడం సిగ్గు చేటన్నారు. టీడీపీ హయాంలో చేసిన అక్రమాలు, అన్యాయాలన్నీ బయటకు వస్తాయన్నారు. ఎమ్మెల్యే స్వామి అక్రమాలను బయటపెడితే దాడులకు పాల్పడటం టీడీపీ అహంకారానికి నిదర్శనమన్నారు. టీడీపీ నేతల ఆగడాలకు రానున్న ఎన్నికల్లో ప్రజలే మరోసారి బుద్ధి చెబుతారన్నారు. టీడీపీ మోసపూరిత ఎన్నికల మేనిఫెస్టో, హామీలను ప్రజలు నమ్మరని ఎమ్మెల్సీ సునీత అన్నారు.

సెల్ టవర్ ఎక్కి ఆందోళన



టవర్ పైన ఉన్న జయరాజ్

కంభం: కందులాపురం కూడలిలో అంబేడ్కర్ విగ్రహం సమీపంలో జగ్జీవన్‌రావ్ విగ్రహం ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకుడు నేదరపల్లి జయరాజ్ సెల్‌ఫోన్ టవర్ ఎక్కి ఆందోళనకు దిగాడు. వివరాల్లోకి వెళితే..ఇటీవల కాలంలో అంబేడ్కర్ విగ్రహం సమీపంలో జగ్జీవన్ రావ్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ ఉన్న జగ్జీవన్‌రావు విగ్రహాన్ని మంగళవారం తెల్లవారుజామున అధికారులు అక్కడి నుంచి తొలగించారు. దీంతో ఎమ్మార్పీఎస్ నాయకులు కందులాపురం కూడలిలో ఆందోళన చేపట్టారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు జయరాజ్ అక్కడే ఉన్న టవర్ ఎక్కాడు. ఆందోళన చేస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. రెండున్నర గంటల సేపు పోలీసులు నచ్చచెప్పినా జయరాజ్ టవర్ దిగిరాలేదు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న స్థలాన్ని కొలతలు వేసి సమస్యను పరిష్కరించేలా చూస్తామని రెవెన్యూ అధికారులు, పోలీసులు హామీ ఇవ్వడంతో కిందకు దిగి వచ్చాడు.

గుప్త నిధుల కేసులో నిందితుల అరెస్టు

పుల్లలచెరువు: గుప్త నిధుల కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీహరి తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి దుర్గం కొండపై గత నెల 31వ తేదీన గుప్త నిధుల కోసం ముఠా తవ్వకాలు చేపట్టారు. తవ్వకాల్లో భాగంగా చేపట్టిన బ్లాస్టింగ్‌లో పుల్లలచెరువు మండలం ముటుకుల గ్రామానికి చెందిన ఉప్ప శ్రీను మృతి చెందాడు. ముఠాసభ్యులు శ్రీను మృతదేహాన్ని తీసుకుని ఈ నెల 1న ముటుకులలోని ఇంటి ముందు ఉంచి రూ.35 వేల నగదు, పిల్లల బాధ్యతను చూసుకుంటామని లేఖను ఉంచి వెళ్లారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మార్కాపురం డీఎస్పీ ఆధ్వర్యంలో మూడు బృందాలు కేసు దర్యాప్తును ప్రారంభించాయి. ముఠాసభ్యులు ఉదయగిరి కొండపై గుప్త నిధుల కోసం తవ్వకాలు ప్రారంభించారనే కోణంలో విచారణ చేయగా నిజానిజాలు బయటకు వచ్చాయి. గుప్త నిధుల తవ్వకాలకు చెందిన ముఠాలో పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలంలోని నిడికంటిపాలెం గ్రామానికి చెందిన జడా సురేష్‌బాబు, అద్దంకి మండలం మణేశ్వరానికి చెందిన అయినంపూడి సుధాకర్, నెల్లూరుకు చెందిన షేక్ జానీలను సోమవారం రాత్రి అదుపులోకి తీసుకొని మంగళవారం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై తెలిపారు. ముఠాలో మరికొంత ఉన్నారని, వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.

విద్యుత్ కార్యాలయంలో భారీ అగ్ని ప్రమాదం



విద్యుత్ కార్యాలయంలో చెలరేగిన మంటలు



మంటలను ఆర్పుతున్న ఫైరింజన్

- సకాలంలో స్పందించిన అగ్నిమాపక సిబ్బంది
- తప్పిన పెను ప్రమాదం
- ఊపిరి పీల్చుకున్న విద్యుత్ అధికారులు

ఒంగోలు టౌన్: నగరంలోని కర్నూలురోడ్డులో ఉన్న విద్యుత్ కార్యాలయంలో సోమవారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. అయితే సిబ్బంది సకాలంలో స్పందించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. అర్ధరాత్రి సుమారు ఒంటి గంట ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. సిబ్బంది వెంటనే అగ్నిమాపక అధికారులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైరింజన్లతో మంటలను అదుపు చేశారు. సుమారు గంటన్నర సేపు శ్రమించిన తరువాత మంటలు అదుపులోనికి వచ్చాయి. లేకుంటే ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండేదని సమాచారం. ఆ సమయంలో కార్యాలయం ఆవరణ నిండా మరమ్మతుల కోసం వచ్చిన ఎన్నో ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. మంటల వేడికి ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయాయి. దీనిలో ఉన్న ఆయిల్ మంటలకు అంటుకోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది రావడంతో పెను ప్రమాదం తప్పిందని, లేకుంటే మొత్తం కార్యాలయం కాలి బూడిదయ్యేదని కొందరు అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యాలయం వెనుకనే పెద్ద ఎత్తున స్క్రాప్ ఉందని, మంటలు అక్కడికి విస్తరించి ఉంటే ప్రమాదం తీవ్రత పెరిగేదని చెబుతున్నారు. ప్రమాదం జరిగిన సమాచారం తెలుసుకున్న వెంటనే ఈఈ పాలగిరి శ్రీనివాసరావు, ఎస్పీఎం డీఈఈ కె.వెంకటేశ్వర్లు, ఏఈ వీరాంజనేయులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. అగ్నిమాపక దళ జిల్లా అధికారి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో రెస్క్యూ టీం మంటలను అదుపు చేశారు. మంగళవారం ఉదయం ఎస్ఈ సత్యనారాయణ ఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో రెండు రివైండింగ్ మిషన్లు, 8 ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర సామగ్రి కాలిపోయినట్లు అధికారులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రమాదంలో రూ.5.65 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు కాల్ సెంటర్

- సమస్యలు ఉన్న వారు 7093930922 ఫోన్ చేసి నివృత్తి పొందొచ్చు



ఏర్పాటు చేసిన కాల్ సెంటర్

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఏమైనా సమస్యలు ఉంటే ఒంగోలులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ జిల్లా అధికారి ఈమన పేరయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ ప్రత్యేకంగా ఈ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో గృహ నిర్మాణ లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి 7093930922 నంబర్‌ను కేటాయించినట్లు తెలిపారు. ఈ నంబర్‌కు ఈ నెల 7వ తేదీ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కాల్ సెంటర్‌లో సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించిన సమస్యల వరకు మాత్రమే సిబ్బంది తగు సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చన్నారు. తద్వారా పరిష్కారం పొందవచ్చని కూడా వెల్లడించారు.

వీఆర్‌ఓ కిడ్నాప్ కలకలం

చినగంజాం: చినగంజాం రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న వీఆర్వో సుబ్రహ్మణ్యం కిడ్నాప్ తీవ్ర కలకలం రేపింది. తనను కిడ్నాప్ చేసి రూ.2 కోట్లు డిమాండ్ చేసిన దుండగులు ఏడు రోజులు బంధించి తీవ్రంగా గాయపరిచి చివరకు రూ.లక్ష నగదు, రెండు ఖాళీ చెక్కులు తీసుకొని ఒంగోలులో వదిలి వెళ్లినట్లు సోమవారం ప్రకాశం ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో కిడ్నాప్ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఇంకొల్లు సీఐ సూర్యనారాయణ, చినగంజాం ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం..సుబ్రహ్మణ్యం తన స్నేహితుడు కోటేశ్వరరావుతో కలిసి కడవకుదురు జాతీయ రహదారి సమీపంలోని ఎం–3 రెస్టారెంట్‌లో భోజనం చేసి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు మత్తు మందు ఇచ్చి కిడ్నాప్ చేశారని పేర్కొన్నాడు. తనను విడిచి పెట్టాలంటే రూ.2 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వారం రోజులు తీవ్రంగా హింసించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. చివరకు తనను చంపేందుకు ప్రయత్నించగా తన అక్కకు ఫోన్ చేసి రూ.1.08 లక్షలు నగదు, రెండు ఖాళీ చెక్కులు ఇవ్వగా తనను కిడ్నాపర్‌లు వదలి వేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కిడ్నాప్ గురైన బాధితుడిని అదుపులోకి తీసుకొని అన్ని కోణాల్లో విచారిస్తున్నారు. ఈ వ్యవహారంపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి.